ఆంధ్రా స్వాములోరా? బాసర అమ్మవారా?

పుష్కరఘాట్ కబ్జా.. అకృత్యాలకు అడ్డా

గోదావరి నిత్య హారతి కార్యక్రమంతో వసూళ్ల దందా

భక్తి ముసుగులో రోజుకు 50 వేల నుంచి లక్ష కలెక్షన్లు

- ఉదయం పూట ఘాట్ అద్దెకిస్తూ మరో రకం వ్యాపారం
- లక్ష్మీ నరసింహస్వామి ఆలయ ధ్వంసంతో ప్రస్థానం
- శ్రీ వేద భారతి పాఠశాల నిర్వాహకుడిపై ఆరోపణలు
- ఘాట్‌లో అడుగుపెట్టేందుకు వణుకుతున్న అర్చకులు
- బాసర అమ్మవారి ఉనికికే ప్రమాదమంటున్న స్థానికులు

ప్రత్యేక ప్రతినిధి, మే 6 (నమస్తే తెలంగాణ): 'అన్ని కులాల వారికి వేదం నేర్పిస్తా. హైందవ ధర్మాన్ని పెంపొందించమే నా లక్ష్యం' అంటూ పుష్కరకాలం క్రితం పవిత్ర బాసర క్షేత్రంలోకి ఆంధ్రా స్వామీజీ ఒకరు వచ్చారు. 2011లో శ్రీ వేదభారతి పీఠం పేరుతో వేద పాఠశాలను ప్రారంభించారు. అన్ని కులాల పిల్లలకు వేదం నేర్పించడమనేది మంచి విషయమేనని బాసర గ్రామస్థులంతా ఆయనకు బాసటగా నిలిచారు. అమ్మవారి క్షేత్రంలో వేద పాఠశాల ఉంటే గుర్తింపు వస్తుందని భావించారు. హైందవ ధర్మం పేరు చెప్పడంతో హిందూ సంఘాల నాయకులు, రాజకీయ పార్టీల నుంచి పూర్తి సహకారం లభించింది. అందరి మద్దతుతో మొదలైన స్వామీజీ ప్రస్థానం నేడు వ్యవస్థలనే శాసించే స్థాయికి ఎదిగింది. స్థానిక నాయకులకు స్వామీజీ ఏం చెప్తే అదే వేదంగా మారింది. అదే ఇప్పుడు ఆయన చేతిలో ఆయుధంగా మారింది. బాసర క్షేత్ర ప్రతిష్ఠను ఆయన మంట గలుపుతున్నా అడిగేవారు, అడ్డు చెప్పేవారు లేకుండా పోయారు. బీసీ వేద విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతుంటే పోలీసులు, అధికారులు సైతం ఏం చేయలేని పరిస్థితి నెలకొన్నది. వేద పాఠశాల ముసుగులో గుర్తింపు తెచ్చుకున్న స్వామిజీ సరస్వతి క్షేత్రానికే పెను ప్రమాదంగా మారుతారని, గోదావరి ఘాట్‌ను కబ్జా చేసి నిత్య హారతి పేరుతో లక్షల రూపాయల వసూళ్ల దందా చేస్తాడని, సరస్వతీ అమ్మవారి సన్నిధిలో అనాదిగా వస్తున్న పలకపై బియ్యంతో చేసే అక్షరాభ్యాసానికి పోటీగా బీజాక్షర విషవృక్షాన్ని నాటుతాడని కలలో కూడా అనుకోలేదని స్థానికులు ఇప్పుడు వాపోతున్నారు. వేద పాఠశాల పేరుతో మొదలు పెట్టి విద్యార్థుల ప్రాణాలు బలిగొనే వరకు ఎన్నో ఆకృత్యాలు, ఎన్నో అరాచకాలు. ఇప్పటికైనా వాటిని అడ్డుకోలేకపోతే బాసర సరస్వతీ అమ్మవారి ఉనికే ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉన్నదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విధ్వంసంతో మొదలైన ప్రస్థానం

వేద విద్యానంద గిరిస్వామి ప్రస్థానం బాసరలో 2007-08 సమయంలో మొదలైంది. ఎక్కడి నుంచి వచ్చారో తెలియదు కానీ తన శిష్యుడి ద్వారా బాసరలో కొంత భూమిని కొనుగోలు చేశారు. ఆ భూముల్లో ఓ రాళ్ల గుట్టలో ఉన్న లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని సైతం స్వామిజీ తొలగించినట్టు స్థానికులు గుర్తుచేసుకున్నారు. అప్పట్లో ఈ అంశాలపై వరుస వార్తా కథనాలు సైతం వచ్చినట్టు చెప్తున్నారు. పట్టా భూమి కావడంతో అడ్డుకోలేకపోయామని గ్రామస్థులు అంటున్నారు. ఇలా స్వామిజీ ప్రస్థానం ఓ ఆలయ విధ్వంసంతో మొదలైందని చెప్తున్నారు. కొంతకాలం అక్కడే గుడిసె వేసుకున్న స్వామి అన్ని కులాలకు వేద విద్య పేరుతో ప్రచారం మొదలుపెట్టారు. అలా 2011లో స్వామీజీ వేద పాఠశాలను ప్రారంభించారు. ఏపీ నుంచి, తెలంగాణలోని కొన్ని జిల్లాల నుంచి వివిధ కులాల విద్యార్థులను పాఠశాలలో చేర్చుకున్నారు. కొంతకాలం అయ్యాక స్థానికంగా పరిచయాలు పెంచుకున్నారు. అలా నిజామాబాద్ జిల్లాకు చెందిన ఓ బీజేపీ నాయకుడితో స్వామీజీకి పరిచయం ఏర్పడింది. 2015లో గోదావరి పుష్కరాల సమయంలో ఆలయ సమీపంలో పుష్కర ఘాట్లు నిర్మించారు. ఆ సమయంలో గోదావరి పరివాహక ప్రాంతం మొత్తం ఘాట్లు ఏర్పాటు చేశారు. 2017 నవంబర్ 4న తనకు పరిచయమైన బీజేపీ నాయకుడి ప్రోత్సాహంతో స్వామీజీ దక్షిణ గంగా వేద నిత్యహారతి పేరుతో బాసర గోదావరిలో నిత్య హారతి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇందుకోసం ఘాట్‌లోని కొంత భాగాన్ని ఆక్రమించారు. అది సదరు బీజేపీ నాయకుడి రిసార్ట్ ముందున్న ఘాట్ కావడంతో అందులో ఆ నేతకు కొంత భూమి ఉందని స్థానికంగా చెప్పుకుంటూ ఘాట్‌ను కబ్జా చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పుష్కర ఘాట్‌లో ఏర్పాటు చేసిన విగ్రహాలు

కాశీ తరహాలో ఆకట్టుకొని బురిడీ

నిత్య హారతి నిర్వహణ ఆలోచన వచ్చాక స్వామిజీ పాఠశాలలోని విద్యార్థులను కాశీకి తీసుకువెళ్లారు. అక్కడే కొన్ని రోజుల పాటు గంగా హారతిపై శిక్షణ తీసుకున్నారు. ఆ తరహాలో ఇక్కడ హారతి ఇచ్చేందుకు అక్కడ అర్చకుల భంగిమలు, చదివే మంత్రాలు, డ్రెస్ కోడ్ ఇలా అన్నింటినీ పరిశీలించారు. కాశీ తరహాలో ఇక్కడ హారతి ఇవ్వడం మొదలుపెట్టారు. బాసరకు వచ్చే భక్తులు నిత్యహారతి చూడటం మొదలైంది. అలా నిత్యహారతి కార్యక్రమాన్ని ప్రచారంలోకి తెచ్చారు. భక్తులను ఆకట్టుకొని సోషల్ మీడియా ద్వారా ఫాలోవర్లను పెంచుకున్నారు. 2017లో వేద పాఠశాల నిర్వహణ, నిత్య హారతి లాంటి దైవ కార్యాలను నిర్వహిస్తున్నామని ఇందుకోసం రూ.15 లక్షల నిధులు కావాలంటూ నేరుగా ప్రభుత్వానికే దరఖాస్తు పెట్టుకున్నారు. నిర్మల్ నుంచి అప్పుడు దేవాదాయశాఖ మంత్రిగా ఉన్న ఇంద్రకరణ్‌రెడ్డిపై ఈ మేరకు స్థానికుల నుంచి ఒత్తిడి తీసుకువచ్చారు. దీంతో 2019లో దేవాదాయశాఖ ధూపదీప నైవేద్యం కింద ఆలయానికి వచ్చే సీజీఎఫ్ నిధుల నుంచి రూ.10 లక్షలు వేద పాఠశాలకు మంజూరు చేసింది. కానీ ఇప్పటి వరకు ఆ రూ. 10లక్షలు ఏం చేశారు? ఎక్కడ ఖర్చు పెట్టారు అన్న లెక్కలేవీ చెప్పలేదు. నిబంధనల ప్రకారం ఈ లెక్కలు వెల్లడించాల్సి ఉందని, కానీ ఆరేండ్లు పూర్తి కావస్తున్నా లెక్కలు చెప్పలేదని, ఇప్పటికైనా ఆ వివరాలు వెల్లడించాలని బాసర ఆలయ ఈవో 2024 జూలై 8న సదరు పాఠశాల నిర్వాహకుడైన స్వామిజీకి లేఖ రాశారు. కానీ దానికి సమాధానం ఇప్పటికీ రాలేదని తెలిసింది. దీంతో ఆ డబ్బులు సైతం దుర్వినియోగం చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

వేద విద్యానంద గిరి స్వామీజీ

స్వామీజీ ఖాతాలోకి సొమ్ము

వసూలు చేసిన డబ్బులు ఇన్ని సంవత్సరాలుగా ఎంత మొత్తం వచ్చాయి? ఆ డబ్బులు ఏం చేశారు? ఎక్కడ ఖర్చు పెట్టారనే దానిపై లెక్కా పత్రాలు లేవు. నిబంధనల ప్రకారం నిత్య హారతిపై వచ్చే ఆదాయం బాసర ఆలయానికి ఇవ్వాలి. కానీ ఇక్కడ ఆలయంతో సంబంధం లేకుండా వసూలు చేసిన డబ్బులన్నీ స్వామీజీకి వెళ్లిపోతున్నాయి. పుష్కరఘాట్‌లో నిత్యహారతిలో వచ్చే ఆదాయమే కాకుండా, ఉదయం ఇదే ఘాట్‌ను అద్దెకు ఇస్తారని తెలిసింది. వివిధ జిల్లాల నుంచి వచ్చే అర్చకులు పూజలు చేసుకోడానికి, అపరకర్మలకు, సంకల్పాలకు, యాగాలకు, హోమాలకు ఘాట్‌ను ఇచ్చి డబ్బులు వసూలు చేస్తారని అక్కడికి వచ్చే భక్తులు చెప్తున్నారు. ఇలా పుష్కరఘాట్‌ను కబ్జా చేసి విచ్చలవిడిగా డబ్బులు వసూళ్లు చేయడం, ఆలయ ఆదాయానికి గండి కొడుతుండటంతో స్థానికుల నుంచి తిరుగుబాటు మొదలైంది.

దందా చేసే స్వామీజీకే సపోర్టు

స్వామీజీ నిత్యహారతి దందా, వేద పాఠశాల విద్యార్థులతో చేయించే వెట్టిచాకిరీ, బీజాక్షరం పేరుతో చేస్తున్న పనులన్నింటినీ కండ్లారా చూసిన బాసర గ్రామస్థుల్లో కొందరు స్వామీజీ తీరును ప్రశ్నించడం మొదలుపెట్టారు. ఆలయ ఆదాయానికి గండి కొట్టడం, అనాదిగా వస్తున్న ఆచార సంప్రదాయాలను తప్పుదోవ పట్టించేలా బీజాక్షరం పేరుతో కొత్త రాగం ఎత్తుకోవడం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ క్రమంలోనే విద్యార్థులపై దాడులు, ఒకరి మృతితో స్థానికంగా దుమారం రేగింది. దీంతో నిత్యహారతి కార్యక్రమం గ్రామ కమిటీ చేతుల్లోకి వెళ్లిపోయింది. ఈ నేపథ్యంలో ఆలయం తరపున ప్రతి బుధవారం గోదావరికి హారతి ఇవ్వాలంటూ దేవాదాయశాఖ నుంచి ఆదేశాలు వెల్లువడ్డాయి. దీంతో ప్రతి బుధవారం ఆలయ అర్చకులు గోదావరికి హారతి ఇస్తున్నారు. గత బుధవారం ఆలయం తరపున స్వామిజీ ఆక్రమిత ఘాట్‌లో పూజారులు హారతి ఇచ్చారు. అధికారుల నుంచి వచ్చిన మౌఖిక ఆదేశాల మేరకు అక్కడ హారతి ఇచ్చినట్టు పూజారులు తెలిపారు. దీంతో ఘాట్ ఎక్కడ చేయిజారిపోతుందోనని భావించిన స్వామీజీ.. స్థానిక ఎమ్మెల్యేలతో ఈవోకు ఫోన్లు చేయించినట్టు తెలిసింది. ఆ ఘాట్‌లో స్వామీజీ మాత్రమే హారతి ఇస్తారని, ఆలయ తరపున ఇవ్వొదంటూ సదరు నేతలు హుకుం జారీచేసినట్లు సమాచారం. అప్పటి దాకా గ్రామ కమిటీ ఆధ్వర్యంలో హారతి ఇచ్చిన వేద పాఠశాల నిర్వాహకులు, గురువారం నుంచి తిరిగి ఘాట్‌లోకి రంగప్రవేశం చేశారు. దీంతో ఆ ఘాట్ సరస్వతీ అమ్మవారిదా? లేకపోతే స్వామీజీదా? అర్థం కాని పరిస్థితులు నెలకొన్నాయని స్థానికులు చెప్తున్నారు. వేద పాఠశాల పేరుతో వచ్చి గోదావరి నిత్య హారతి, బీజాక్షరం పేరుతో స్వామీజీ చేసే అకృత్యాలకు అడ్డే లేకుండా పోతున్నదని వాపోతున్నారు. ఇప్పటికైనా బాసరలో స్వామీజీ ఆగడాలను అడ్డుకునేందుకు చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో బాసర క్షేత్ర ఉనికే ప్రశ్నార్థకంగా మారిపోయే ప్రమాదం ఉందంటున్నారు. స్థానిక నాయకులు సైతం ఇలా వసూళ్ల దందా చేసే స్వామీజీకి సపోర్ట్ చేయకుండా, బాసర అమ్మవారికి అండగా నిలవాలని కోరుతున్నారు.

ఘాట్‌లోనే లక్షలు వసూలు

కబ్జా చేసిన గోదావరి ఘాట్‌లో సదరు బీజేపీ నేత సహకారంతో 2018లో ఓ షెడ్డు నిర్మించారు. గోదావరి (గంగా) మాత విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అక్కడే నిత్య హారతి ఇవ్వడం మొదలుపెట్టారు. తొలినాళ్లలో ఉచితంగానే నిత్యహారతి పేరు చెప్పినా, కొన్నాళ్లకు దోపిడీ మొదలైంది. ఏడాది తిరగకుండానే ఘాట్‌లో గంగా మాత పక్కనే మహంకాళి, దుర్గామాత విగ్రహాలను ఏర్పాటు చేసి, ఐదారు శివలింగాలను ప్రతిష్ఠించారు. ఇక నిత్యహారతి కార్యక్రమ ప్రారంభానికి ముందే రుద్రాభిషేకం, గోదావరి తల్లికి ఒడి బియ్యం పొయ్యడం, చీర సమర్పించడం, దీపాల కోసం నూనె దానంగా తీసుకోవడం అంటూ నెమ్మదిగా వసూళ్ల దందాను మొదలుపెట్టినట్టు తెలిసింది. వచ్చే భక్తుల స్థాయిని అనుసరించి రుద్రాభిషేకానికి రూ.1000 నుంచి రూ.10 వేలు, ఒడిబియ్యం-నూనె పూజకు రూ.500 చొప్పున వసూలు చేస్తారని తెలిసింది. ఇవి చేయించుకునే భక్తులకు ఎలాంటి రసీదు ఇవ్వరు. ఈ డబ్బులు వేద పాఠశాల, గోశాల నిర్వహణకు డొనేషన్ రూపంలో తీసుకుంటారు. ఇవే కాకుండా గోదావరి హారతి ఇచ్చాక వచ్చే చదివింపులు అదనం. ఇలా ఒక్క పుష్కర ఘాట్‌లోనే రోజూ వారి ఆదాయం రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు ఉంటుందని స్థానికులు చెప్తున్నారు.

బాసర గోదావరి సమీపంలో కబ్జా చేసిన పుష్కర ఘాట్

నలుగురు రైతుల ఆత్మహత్య

మొదటిపేజీ తరువాయి...

మానసికంగా కుంగిపోయాడు. మంగళవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కాగా మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం పొనూర్ గ్రామానికి చెందిన కౌలు రైతు బౌతు శంకర్(45) ఐదెకరాలు కౌలు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. సాగుకు రూ.6 లక్షల అప్పు తీసుకువచ్చాడు. ఇటీవల గాలివానకు పంట మొత్తం నేలవాలింది. దిగుబడి రాదేమోనని, అప్పులు తీర్చలేనేమోనన్న బెంగతో సోమవారం ఇంట్లో గడ్డి మందు తాగాడు. కుటుంబ సభ్యులు మంచిర్యాల ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించగా, మంగళవారం మృతి చెందాడు.

నిర్మల్ జిల్లాలో ఇద్దరు..

నిర్మల్ జిల్లా తానూర్ మండలం ఝరి(బి) గ్రామానికి చెందిన బొడ్డొల్ల పోతన్న(53) తనకున్న రెండు ఎకరాల భూమిలో వ్యవసాయం చేస్తున్నాడు. సాగుకు రూ.3 లక్షల వరకు అప్పులు కాగా, వాటిని చెల్లించే స్థోమత లేక మనస్తాపానికి గురై మద్యానికి అలవాటుపడ్డాడు. మంగళవారం ఉదయం మండల శివారు చేనులో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. నిర్మల్ జిల్లా భైంసా మండలం గుండెగాంకు చెందిన సూర్యవంశీ ప్రసాద్(48) పంచాయతీ కార్యాలయంలో కారోబార్‌గా పనిచేస్తున్నాడు. గుండెగాంకు ఆనుకొని నిర్మించిన రంగారావు పల్సికర్ బ్యాక్‌వాటర్ ఏరియాలో ప్రసాద్ తనకున్న నాలుగెకరాల్లో సోయా సాగుచేశాడు. వర్షాకాలంలో బ్యాక్ వాటర్ పెరగడంతో సోయాపంట పూర్తిగా మునిగిపోయింది. ఈ యాసంగిలో సాగుచేసిన జొన్న పంటను కోతకోసి ఆరబెట్టగా గాలి దుమారంతో కూడిన వర్షానికి కంకులన్నీ తడిచిపోయాయి. ప్రాజెక్ట్ బ్యాక్‌వాటర్‌తో ఇల్లు కూడా కూలిపోయింది. దీంతో భైంసాలో అద్దెకు ఉంటున్నాడు. ప్రభుత్వం ఇస్తున్న జీతం రావడం లేదు. అద్దె కట్టడానికి డబ్బులు లేని దుస్థితికి చేరాడు. సాగుకు చేసిన రూ.6 లక్షల అప్పు ఎలా తీర్చాలో తెలియక మనస్తాపం చెందాడు. సోమవారం రాత్రి జొన్న పంటకు కాపలా ఉంటానని భార్యతో చెప్పి గ్రామ శివారులోని చేను వద్దకు వెళ్లి చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

ఓఎంసీ కేసులో సబిత నిర్దోషి

మొదటిపేజీ తరువాయి...

వ్యవస్థపై తనకు సంపూర్ణమైన విశ్వాసం ఉందని అప్పుడూ..ఇప్పుడు అదే మాట చెబుతున్నానని అన్నారు. ఓబుళాపురం గనుల కేసులో న్యాయస్థానం తనను నిర్దోషిగా ప్రకటించినందుకు న్యాయవ్యవస్థకు ధన్యవాదాలు తెలిపారు. 'ఏ తప్పూ చేయకపోయినా ఈ కేసులో నన్ను చేర్చడంపై బాధపడ్డాను. న్యాయవ్యవస్థ ద్వారా న్యాయం జరుగుతుందని నమ్మాను. ఇన్నేండ్లుగా పడిన అవమానాలు, ప్రతిపక్షంలో ఉన్నవారు నన్ను అవినీతిపరురాలినని, జైలుకు పోతానని మాటలు అంటుంటే ఎంతో బాధపడ్డాను. నా జిల్లా ప్రజలు, నియోజకవర్గం ప్రజలు నాపై సంపూర్ణ విశ్వాసం ఉంచారు. నన్ను గెలిపిస్తూ వచ్చారు. వారందరికీ ధన్యవాదాలు' అని చెప్పారు.

గాలి జనార్దన్‌రెడ్డికి ఏడేండ్ల జైలు

నాంపల్లి క్రిమినల్ కోర్టులు, మే 6 (నమస్తే తెలంగాణ) : ఓబుళాపురం మైనింగ్ కేసులో ప్రధాన నిందితుడు గాలి జనార్దన్‌రెడ్డితోపాటు ఐదుగురిని నాంపల్లి సీబీఐ కోర్టు దోషులుగా ఖరారు చేసింది. వీరందరికి ఏడేండ్ల జైలుశిక్ష విధిస్తూ తీర్పు చెప్పింది. గాలి జనార్దన్‌రెడ్డి, బీవీ శ్రీనివాస్‌రెడ్డి, మొఫజ్ అలీఖాన్, వీడీ రాజగోపాల్‌రెడ్డికి జైలుశిక్షతోపాటు రూ.10 వేల చొప్పున జరిమానా విధించింది. ఓబుళాపురం మైనింగ్ కంపెనీకి రూ.2 లక్షల జరిమానా విధించింది. తాను పేద కుటుంబం నుంచి వచ్చానని, శిక్షను తగ్గించాలని గాలి జనార్దన్ రెడ్డి కోర్టును వేడుకున్నారు. ప్రజలకు సేవచేస్తున్నానని, తానెప్పుడూ మోసాల కు తావివ్వలేదని, పేదలకు అంకితభావంతో సేవచేసే అవకాశం కల్పించాలని కోర్టును కో రారు. తన సేవలను గుర్తించి ప్రజలు తనను ఎమ్మెల్యేగా ఎన్నుకున్నారని తెలిపారు. గతం లో మూ డేండ్లు జైల్లోనే గడిపానని తెలిపారు. నలుగురు దోషులు జరిమానా కట్టని పక్షంలో అదనంగా జైలు శిక్ష అనుభవించాలని కోర్టు స్పష్టంచేసింది. నలుగురు దోషులను అధికారులు చంచల్‌గూడ జైలుకు తరలించారు.

రాజగోపాల్‌కు మరో నాలుగేండ్ల జైలు

ఈ కేసులో వీడీ రాజగోపాల్‌కు కోర్టు అదనంగా మరో నాలుగేండ్ల జైలుశిక్ష విధించింది. భూగర్భ గనుల శాఖ డైరెక్టర్‌గా ఉన్నందున అవినీతి నిరోధక చట్టం కింద అదనపు శిక్షను ఖరారు చేసింది. ప్రభుత్వ అధికారిగా ఉంటూ అక్రమాలకు పాల్పడినందుకుగాను 11 ఏండ్ల పాటు జైలుశిక్ష అనుభవించాలని పేర్కొంది.

కేసు పూర్వాపరాలు

వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం 2007 జూన్ 18న ఓబుళాపురం గనులను ఓఎంసీకి లీజుకు ఇస్తూ ఉత్తర్వులు జారీచేసింది. కేటాయింపుల్లో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలతో 2009 డిసెంబర్ 7న సీబీఐ కేసు న మోదు చేసింది. అప్పటి నుంచి విచారణ కొనసాగుతూనే ఉన్నది. సీబీఐ నాలుగు సార్లు చార్జిషీట్ దాఖలు చేసి 219 మంది సాక్షులను విచారించింది. పెద్ద ఎత్తున మైనింగ్ చేపట్టినట్టు సీబీఐ గుర్తించింది. సబితా ఇంద్రారెడ్డి గనుల శాఖ మంత్రిగా ఉండటంతో అమె పేరును కూడా కేసులో చేర్చారు. ఏ5గా ఉన్న లింగారెడ్డి మృతిచెందగా ఏ6గా ఉన్న ఐఏఎస్ అధికారి శ్రీలక్ష్మిని 2022లో ఈ కేసు నుంచి తెలంగాణ హైకోర్టు డిశ్చార్జి చేసింది. తాజాగా మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని, అప్పటి పరిశ్రమల శాఖ కార్యదర్శి కృపానందంను నిర్దోషులుగా ప్రకటించింది.

భూసేకరణ తర్వాతే ట్రిపుల్‌ఆర్

- ఎంత త్వరగా పూర్తిచేస్తే అంత త్వరగా పనులు
- రాష్ట్ర నేతలకు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ స్పష్టీకరణ

హైదరాబాద్, మే 6 (నమస్తే తెలంగాణ): భూసేకరణ ప్రక్రియ పూర్తయ్యాకే రీజినల్ రింగ్ రోడ్డు (ట్రిపుల్‌ఆర్) ఉత్తర భాగం పనులకు మోక్షం లభిస్తుందని తాజాగా సీఎం రేవంత్‌రెడ్డితోపాటు రాష్ట్ర మంత్రులకు కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ స్పష్టం చేసినట్టు తెలుస్తున్నది. 162 కి.మీ. పొడవైన ట్రిపుల్‌ఆర్ ఉత్తర భాగం నిర్మాణ పనుల కోసం జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) ఇదివరకే టెండర్లు పిలిచినప్పటికీ భూసేకరణ సమస్య కారణంగా ఇంకా ఏజెన్సీలను ఖరారు చేయలేదు. అయితే ట్రిపుల్‌ఆర్‌కు కేంద్రం నుంచి ఫైనాన్షియల్, క్యాబినెట్ అనుమతులు రావాల్సి ఉన్నదని అధికారులు చెప్తున్నారు. సోమవారం రాష్ట్ర పర్యటనకు వచ్చిన గడ్కరీని సీఎం రేవంత్, ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కలిసి తెలంగాణలో జాతీయ రహదారుల అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఇందులో భాగంగా ట్రిపుల్‌ఆర్‌కు కేంద్రం నుంచి రావాల్సిన అనుమతులను వెంటనే ఇచ్చి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై గడ్కరీ స్పందిస్తూ.. భూసేకరణను పూర్తిచేయాలని సూచించినట్టు తెలిసింది. ఆ ప్రక్రియ పూర్తయితే ట్రిపుల్‌ఆర్ పనులను చేపట్టేందుకు ఎలాంటి ఇబ్బంది లేదని స్పష్టం చేసినట్టు సమాచారం. ట్రిపుల్‌ఆర్ ఉత్తర భాగం నిర్మాణానికి 1,950 హెక్టార్ల భూములు సేకరించాల్సి ఉండగా.. అందులో ఇప్పటివరకు 85% భూసేకరణ పూర్తయింది. ట్రిపుల్‌ఆర్ నిర్మాణంలో భాగంగా భూములు, పంటలు, ఇండ్లు తదితర ఆస్తులు కోల్పోతున్న బాధితులకు రూ.5,100 కోట్ల మేరకు నష్టపరిహారం అందించాల్సి ఉంటుందని అధికారులు గుర్తించారు. ఈ ఖర్చును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరిసగం భరించాల్సి ఉన్నది. దీంతో తమ వాటా కింద రూ.2,550 కోట్లు చెల్లించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం.. ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.1,250 కోట్లు కేటాయించింది.



ప్రభుత్వ చొరవ అవసరం

ట్రిపుల్‌ఆర్ భూసేకరణ కోసం గతంలో నోటిఫికేషన్ వెలువడేనాటికి ఉన్న భూముల ధరల ఆధారంగా ప్రభుత్వం ఎకరాకు రూ.6 నుంచి రూ.15 లక్షల వరకు నష్ట పరిహారాన్ని నిర్ణయిస్తూ అవార్డులు పాస్ చేసింది. రైతులు తీవ్రంగా వ్యతిరేకిస్తుండటంతో సమస్య పరిష్కారానికి ప్రభుత్వం కలెక్టర్ల ఆధ్వర్యంలో ఆర్బిట్రేటర్లను ఏర్పాటు చేసింది. భూముల విలువ, బాధితులకు జరుగుతున్న నష్టం ఆధారంగా ఆర్బిట్రేటర్లు పరిహారాన్ని నిర్ణయిస్తున్నారు. అయినప్పటికీ భూసేకరణను వ్యతిరేకిస్తూ కొందరు బాధితులు ఇప్పటికే న్యాయస్థానాన్ని ఆశ్రయించగా.. మరికొందరు తమ భూములను ఇచ్చేదే లేదని ఆందోళనకు దిగుతున్నారు. దీంతో ఈ సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం చొరవ తీసుకోవాలని, భూసేకరణను వ్యతిరేకిస్తున్నవారితో చర్చించి వారు కోరుతున్న విధంగా నష్టపరిహారం చెల్లిస్తే సమస్య పరిష్కారం అవుతుందని అధికారులు చెప్తున్నారు. భూసేకరణ ప్రక్రియను పూర్తిచేసి కేంద్రాన్ని సంప్రదిస్తే.. అక్కడి నుంచి అన్ని అనుమతులు వచ్చి వెంటనే పనులు చేపట్టేందుకు మార్గం సుగమం అవుతుందని స్పష్టం చేస్తున్నారు.

ఏసీబీకి చిక్కిన అధికారులు

- ములుగు జడ్పీ కార్యాలయ సూపరింటెండెంట్, జూనియర్ అసిస్టెంట్ అరెస్ట్

ములుగు, మే 6 (నమస్తే తెలంగాణ) : ములుగు జిల్లాపరిషత్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న నేరెళ్లపల్లి వెంకటేశ్వర్లు అనారోగ్యంతో 2023, 2024లో మెడికల్ లీవ్ తీసుకున్నాడు. 2025 జనవరి నుంచి విధులకు హాజరవుతున్నాడు. మెడికల్ లీవ్‌కు సంబంధించిన బిల్లులు చెల్లించాలని దరఖాస్తు చేసుకున్నాడు. సూపరింటెండెంట్ గాదెగోని సుధాకర్, జూనియర్ అసిస్టెంట్ సానికొమ్ము సామ్యారెడ్డి రూ.3,50,424 బిల్లును తయారు చేసి, ట్రెజరీకి పంపించాలంటే రూ.60వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో బాధితుడు ఏసీబీకి ఫిర్యాదు చేశాడు. రూ.25 వేలను మంగళవారం వెంకటేశ్వర్లు అధికారులకు అందిస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. బుధవారం వరంగల్ ఏసీబీ కోర్టులో హాజరుపర్చనున్నట్టు డీఎస్పీ తెలిపారు.

ఆర్బీఐ నుంచి మరో 2,000 కోట్ల అప్పు

హైదరాబాద్, మే 6 (నమస్తే తెలంగాణ): రేవంత్ సర్కారు ఆర్బీఐ నుంచి మరో రూ.2,000 కోట్ల అప్పు తీసుకున్నది. మంగళవారం నిర్వహించిన ఈ-వేలం ద్వారా ఈ రుణం సేకరించినట్టు ఆర్బీఐ వెల్లడించింది. 28 ఏండ్లకాల పరిమితికి 6.79% వార్షిక వడ్డీతో రూ.1000 కోట్లు తీసుకున్నది. మరో రూ. వెయ్యి కోట్లను 32 ఏండ్లకాల పరిమితికి 6.80% వార్షిక వడ్డీకి సేకరించింది. ఈ ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో రూ.14 వేల కోట్ల రుణ సమీకరణ కోసం ఆర్బీఐకి ప్రతిపాదనలు పంపింది. ఏప్రిల్‌లో 3 దఫాల్లో రూ.4,400 కోట్లు తీసుకున్నది. రెండో నెల మేలో తొలి మంగళవారమే రూ.2,000 కోట్లు సేకరించింది. ఆర్థిక సంవత్సరం మార్కెట్ రుణాల కింద రూ.64,539 కోట్లు సమీకరిస్తామని బడ్జెట్‌లో డిప్యూటీ సీఎం భట్టి ప్రతిపాదించారు.

మినీ అంగన్‌వాడీల అప్‌గ్రేడ్

- 3,989 మందిని ప్రమోట్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు
- 'నమస్తే' కథనానికి స్పందన
- ఆనందంలో అంగన్‌వాడీ టీచర్లు

నమస్తే ఎఫెక్ట్

హైదరాబాద్, మే 6 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని 3,989 మంది మినీ అంగన్‌వాడీ టీచర్లకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. 'నమస్తే తెలంగాణ'లో మంగళవారం 'మొదటి సంతకానికే మోసం' శీర్షికతో ప్రచురితమైన కథనానికి ప్రభుత్వం స్పందించింది. మినీ అంగన్‌వాడీలను మెయిన్ అంగన్‌వాడీ టీచర్లుగా ప్రమోట్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల నుంచే అమల్లోకి వస్తుందని పేర్కొన్నది. మెయిన్, మినీ అంగన్‌వాడీలు అనే తేడా లేకుండా అందరికీ రూ.13,600 చొప్పున వేతనం ఇవ్వాలని నిర్ణయించింది. ప్రభుత్వ నిర్ణయంపై మినీ అంగన్‌వాడీ టీచర్లు సంతోషం వ్యక్తంచేస్తున్నారు. ఏడాదిన్నరగా చేస్తున్న పోరాటం ఫలించిందని మినీ అంగన్‌వాడీ టీచర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు ఆడెపు వరలక్ష్మి తెలిపారు. తమ ఆవేదనపై కథనం ప్రచురించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేసిన 'నమస్తే తెలంగాణ'కు, అలాగే మంత్రి సీతక్కకు కృతజ్ఞతలు తెలిపారు.

పెండింగ్ వేతనాల ఊసేది?

ప్రభుత్వం నిరుడు జనవరిలో మినీ అంగన్‌వాడీలను అప్‌గ్రేడ్ చేసింది. కానీ, పెండింగ్ బకాయిల ఊసెత్తకుండా ఉత్తర్వులు జారీ చేసింది. జనవరి, ఫిబ్రవరి, మార్చి, ఆ తర్వాత జూన్, జూలై నెలల్లో పెరిగిన వేతనాలు అందించింది. సాంకేతిక కారణాల నెపం చూపి నిరుడు ఏప్రిల్, మేతోపాటు ఆగస్టు నుంచి 2025 మే వరకు పాత వేతనాలే ఖాతాల్లో జమచేసింది. ప్రభుత్వం తిరిగి అప్‌గ్రేడ్ చేసినందున పెండింగ్ వేతనాలు రూ.28 కోట్లు చెల్లించాలని అంగన్‌వాడీ టీచర్లు కోరుతున్నారు.

'ఉపాధిహామీ' పెండింగ్ జీతాలు విడుదల

- 'నమస్తే తెలంగాణ' కథనానికి స్పందించిన రేవంత్ సర్కారు
- రూ.62 కోట్లు విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- పెండింగ్‌లో ఏప్రిల్ నెల వేతనం

హైదరాబాద్, మే 6 (నమస్తే తెలంగాణ): మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న సిబ్బందికి పెండింగ్ వేతనాలను రాష్ట్ర ప్రభుత్వం ఎట్టకేలకు విడుదల చేసింది. ఉపాధి హామీ సిబ్బందికి 3,4 నెలలుగా వేతనాలు రాక, ఆ ఉద్యోగుల కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాయని 'నమస్తే తెలంగాణ' వరుస కథనాలు ప్రచురించింది. దీంతో స్పందించిన సర్కారు.. మంగళవారం రెండు నెలల వేతనాలకుగాను రూ.62 కోట్లు విడుదల చేసింది. ఫీల్డ్ అసిస్టెంట్లు, అసిస్టెంట్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు (ఏపీవో), ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు ఇలా మొత్తం 10,400 మందికి రెండునెలల పెండింగ్ వేతనాలు విడుదల చేసింది. ఫీల్డ్ అసిస్టెంట్లకు 4 నెలలకుగాను మూడు నెలలు, ఏపీవో, ఈసీ, సీవో మూడు నెలలకుగాను రెండు నెలల వేతనాలు మాత్రమే చెల్లించింది. ఏప్రిల్ నెలకు సంబంధించిన వేతనాన్ని మాత్రం పెండింగ్‌లో ఉంచింది.

జూన్ 8,9 తేదీల్లో చేప ప్రసాదం పంపిణీ

- తరతరాలుగా పంపిణీ చేస్తున్న బత్తిని కుటుంబం
- ప్రభుత్వం తరఫున ఏర్పాట్లు చేస్తున్న అధికారులు

హైదరాబాద్, మే 6 (నమస్తే తెలంగాణ): వచ్చేనెల 8,9 తేదీల్లో నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో చేప ప్రసాదం పంపిణీ జరగనున్నది. మృగశిర కార్తె రోజు ఆస్తమా బాధితులకు ఆయుర్వేద పద్ధతిలో బత్తిని కుటుంబం తరతరాలుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నది. ఆస్తమా, శ్వాసకోశ సమస్యలతో బాధపడుతున్న వేలాదిమంది ఈ ప్రసాదాన్ని తీసుకునేందుకు భారీగా తరలివస్తుంటారు. ఈ సందర్భంగా మంగళవారం బత్తిని కుటుంబ సభ్యులు మాట్లాడుతూ.. ఈసారి సుమారు 5నుంచి 6 లక్షలమంది చేప ప్రసాదం తీసుకుంటారని అంచనా వేసినట్టు తెలిపారు. ఇందుకోసం అన్ని ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. చేప ప్రసాదం కోసం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ తోపాటు తమిళనాడు, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, కర్ణాటక, ఒడిశా వంటి రాష్ట్రాల నుంచి పెద్దఎత్తున వస్తారని తెలిపారు. ఇది ఒక సంప్రదాయంగా వస్తున్న చికిత్సా పద్ధతి అని అన్నారు. ఈ ప్రసాదం తీసుకునే వ్యక్తులు కొన్ని నియమాలు పాటించాల్సి ఉంటుందని చెప్పారు. రోగుల సౌకర్యార్థం క్యూలైన్లు, నీటి సదుపాయం, వైద్య సదుపాయాలను ఏర్పాటు చేసినట్టు వివరించారు. కాగా, జూన్ 8,9 తేదీల్లో జరిగే ఈ కార్యక్రమానికి ప్రభుత్వం తరఫున ఏర్పాట్లు చేస్తున్నట్టు అధికారులు వెల్లడించారు.